క్లుప్తంగా

మానవాళికి చెట్లే శ్రీరామరక్ష

రైల్వేకోడూర్ అర్బన్ : దేశంలో మానవాళి జీవితానికి చెట్లే శ్రీరామరక్ష అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవడానికి అమ్మ పేరుతో ఒక చెట్టు అని బీజేపీ నాయకత్వం పిలుపుతో చెట్లు నాటి నట్లు సోమవారం బీజేపీ జిల్లా కార్యదర్శి పుల పుత్తూరు రామసుబ్బారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు తల్లి కోసం ఒకచెట్టు నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఏయూ అధ్యాపకురాలికి డాక్టరేట్


షేక్ ఫయాజ్ బేగమ్

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీకి చెందిన సహాయ ఆచార్యులుగా ఉన్న షేక్ ఫయాజ్ బేగంకు ఉత్తర ప్రదేశ్ జేఎస్ యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఈ మేరకు ఏఐటీఎస్ ప్రిన్సిపాల్ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 జీ మొబైల్ నెట్‌వర్క్ అంశంపై పరిశోధన చేసినందుకుగాను ఆమెకు డాక్టరేట్ ఇచ్చారని వివరించారు. ఐఐటీ ఢిల్లీ ఐఐటీ డా.సచిన్ సక్సేనా పర్యవేక్షణలో ఈ పీహెచ్‌డీ ప్రదానం చేశారని వివరించారు. ఈమెకు డాక్టరేట్ రావడం పట్ల ఏయూ అధినేత చొప్పా గంగిరెడ్డి, చొప్పా అభిషేక్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయంలో అన్నదానం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో శ్రీవెంకయ్య స్వామి దేవస్థానంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. మాజీ రాష్ట్ర టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తన తల్లిదండ్రుల పేరు మీద స్థానిక అన్నసత్రంలో పేదలకు అన్నదానం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రమేష్, రత్తయ్య ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కోడూరు విద్యార్థులు

రైల్వేకోడూర్ అర్బన్ : పట్టణంలోని తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో కోచ్ శివాజీ ఆధ్వర్యంలో ఐశ్వర్య, మేఘన, మనోజ్, చైతన్య ప్రసాద్, కృష్ణవేణీలు సోమవారం బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడూరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక అవ్వడం సంతోషకరమని తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ విజయం సాధించడానికి ఉత్తమ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చిట్వేలి : నాగవరం పంచాయతీ, ఉప్పరపల్లిలో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు సోమవారం రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తాతంశెట్టి నాగేంద్ర, పంతగాని నరసింహప్రసాద్, గుండయ్య నాయుడు, అనిత దీప్తి, మాలే బాబు, శివయ్య, వెంకటేష్, శివయ్య, ప్రతాప్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ నరసింహా, వెంకటేశ్వర్లు, రాజు, లారీ సుబ్బరాయుడు, కెకె చౌదరి, నాగరాజు, నవీన్, బాబుజీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

పుల్లంపేట : రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తిరుపతికి చెందిన శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాల్టీ వారిచే ఉచిత మెగా క్యాంపు నిర్వహించనున్నట్లు సర్పంచ్ రమణారెడ్డి తెలిపారు. చెవి, నరాలు, గొంతు తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్జీల స్వీకరణ

రామాపురం : ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. రైతులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా భూములకు సంబంధించిన అర్జీలు రైతులు అధికంగా భూసర్వే చేయాలని ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ వరప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ రామకృష్ణుడు, డీటీ సిద్దేశ్వరరావు, ఆర్ఐ రవికుమార్, పద్మజ పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

ఒంటిమిట్ట : ఈనెల 23, 24, 25వ తేదీలలో ఒంటిమిట్ట మండలంలో ఆధార్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ కుమార రంగయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట సచివాలయంలో పై తేదీలలో ఆధార్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆధార్ సమస్యలు ఉన్నవారు ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా వినాయక మండపం

పెనగలూరు : మండల కేంద్రంలోని కొత్తపల్లె గ్రామం వద్ద వెంగతాత మందిరం సమీపంలో వినాయక మండపం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కొత్తపల్లె గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ తలమంచి గిరీష్‌రెడ్డి దాదాపు రూ. 20 లక్షలతో ఈ మండపాన్ని నిర్మించారు. వినాయక ఉత్సవాలు వారంరోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు.

గొంతు విప్పాలి.. అభివృద్ధి సాధించాలి

నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని వాగ్దానాలు చేశారు. అలాగే తాము అధికారంలోకి వస్తే.. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు కానీ ఇంతవరకు ఊసేలేదు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు గళం విప్పాలని, సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు. –సాక్షి నెట్‌వర్క్



ఉపాధి కల్పనకు కృషిచేయాలి



కోడూరు ప్రాంతంలో చదువుకున్నవారికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. అలాగే అప్పా పరిశ్రమ మూశాక కోడూరు ప్రాంతం ఒక్క పరిశ్రమకు నోచుకోలేదు. అలాగే విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసనకు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేలా శాసనసభ్యులు చొరవ తీసుకోవాలి. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేయదలిచిన గ్రీన్ హైవేని పూర్తి చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి. సమయం వృథా చేయకుండా అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనులు ప్రస్తావించి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేయాలి.

- కొలూరి శివకుమార్‌రెడ్డి, డిగ్రీ, రైల్వేకోడూరు

జరికోన నీరు గ్రామాలకు తెప్పించాలి



సంబేపల్లె మండలంలో ఎటువంటి నీటి సౌకర్యం లేదు. దీంతో ఈ ప్రాంత రైతాంగం వర్షాలపై ఆధారపడి సాగు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మండలానికి అనుకొని ఉన్న జరికోన నుంచి మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలకు తాగునీరు, కాలువల ద్వారా చెరువులలో నీరు నింపి రైతుల సాగునీరు అందించాలి. గత వైఎస్సార్‌సీపీ హయంలో జరికోన నీరు గ్రామాలకు చేర్చడానికి అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. ఇంతవరకు నీరు మాత్రం అందలేదు. మంత్రివర్యులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలలోని చెరువులు నీటిని నింపి మండలాన్ని సస్యశ్యామలం చేస్తే ఈ ప్రాంత రైతుల కళలు నెరవేర్చినట్టు అవుతుంది.

- కిషోర్‌కుమార్‌రెడ్డి, రెడ్డిమళ్లువారిపల్లె, శెట్టిపల్లె పంచాయతీ, సంబేపల్లె

హామీల అమలును అసెంబ్లీలో ప్రస్తావించాలి



టీడీపీ ప్రభుత్వం వచ్చి నెల రోజులు అయిపోయింది. ఇప్పటి వరకు ప్రజలకు మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో పెన్షన్ పెంపు తప్పా మిగతా హామీల ప్రస్తావనే లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇప్పటికే రైతులకు రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందజేస్తూ ఉండేది. విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన పథకాలు ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలలో చదివే విద్యార్థులకు సొమ్మును విడుదల చేసేది. ఈ ప్రభుత్వం హామీల ఊసే లేవనెత్తడం లేదు. అసెంబ్లీ సమావేశాల్లో నైనా హామీల అమలును ప్రకటించాలి.

- రెహమాన్ ఖాన్

అన్నమయ్య డ్యాంను పూర్తి చేయాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నూతన డిజైన్‌తో అన్నమయ్య డ్యాం పునరుద్ధరణకు అంకుర్పారణ జరిగింది. జలాశయంను 8.22 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల చేసే సామర్థ్యంతో డిజైన్ రూపొందించనున్నారు. దాదాపు రూ.635 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. స్వయంగా అన్నమయ్య డ్యాం బాధిత గ్రామాల్లో కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పర్యటించి, ఇష్టానుసరంగా విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వారి ప్రభుత్వమే కాబట్టి ఏ విధంగా డ్యాం నిర్మాణం చేసి, న్యాయం చేయాలని కోరుతున్నారు. – జి.వి. సుబ్బరాజు, రాజంపేట

రైతుల ఆశలు నెరవేర్చాలి



రాజంపేట నియోజకవర్గాలలో ఉద్యానవన రైతులకు మేలు జరిగేనా అనే కోణంలో కొత్త పాలకుల నిర్ణయాలపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో గాలేరు – నగిరి సుజల స్రవంతి ప్రాజెక్టులో ఆగిపోయిన పనులు ముందుకు సాగేనా అన్న అంశం కొత్త ప్రభుత్వానికి సవాల్‌గా మారనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాజంపేట సస్యశామ్యలమవుతుంది. సాగునీరు, తాగునీటికి ఇబ్బందిలేకుండా పోతుంది. – పాపినేని విశ్వనాథరెడ్డి, రాజంపేట

పరిశ్రమలు నెలకొల్పేలా చేయాలి



వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రాయచోటి ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీని ద్వారానే వలసలను తగ్గించవచ్చు. జిల్లాలో పండ్ల తోటల పెంపకంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. అలాగే టమాటా సాగులో జిల్లాలో ఎక్కువగా ఉంది. టమాట ప్రాసెసింగ్ పరిశ్రమలతోపాటు ఇతర పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన స్థలాలు అధికంగా ఉంది. రాయితీలు కల్పించి పరిశ్రమలు తీసుకువస్తే ఈ ప్రాంతాన్ని మేలు చేసిన వారవుతారని స్థానికులు చెప్పుకుంటున్నారు. మంత్రి స్పందించి పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలని రాయచోటి వాసులు కోరుతున్నారు. – డి.నాగభూషణ్‌రెడ్డి, సర్పంచ్, గున్నిగుంట్ల

అభివృద్ధికి బాట వేయాలి



రాయచోటిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు తగిన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో పాటు స్థానికంగా మండిపల్లి రాంప్రసాద్రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా గెలవడం, రాష్ట్ర మంత్రిగా ఎంపిక కావడంతో జరుగుతున్న అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తాయన్న ఆశలు మొలకెత్తాయి.

– సిద్దారెడ్డి, రాయచోటి

తాగు, సాగునీరు అందించాలి



రాయచోటి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు నెరవేరేలా చర్యలు తీసుకోవాలి. పెండింగ్‌లో హంద్రీనీవా కాలువ పనులను పొడిగింప చేసి ఈ ప్రాంతానికి కృష్ణా జలాలను అందించాలి. సంబేపల్లి సమీపంలో ఝరికోన వద్ద ఒక రిజర్వాయర్, చిన్నమండెం సమీపంలోని శ్రీనివాసపురం వద్ద మరో రిజర్వాయర్‌లను కృష్ణా జలాలతో నింపాలి. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు, తాగునీరు అందించి ప్రాంత వాసుల కళలను సాకారం చేయాలి. – ఫయాజ్ అహ్మద్, రాయచోటి

స్థానికంగానే ఉద్యోగాలు కల్పించాలి



నిరుద్యోగులకు ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చింది. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి తీవ్రంగా ఉన్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. పరిశ్రమల ఏర్పాటుతోనే వలసలను నివారించవచ్చు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే వారి సంఖ్య అధికం. స్థానికంగా ఉపాధి లభిస్తే వలసలను తగ్గించవచ్చు. – వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ, రాయచోటి

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాయచోటి అర్బన్ : విద్యార్థులు చదువుతోపాటు డయేరియా, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులపై అవగాహనను కలిగి ఉండడం అత్యవసరమని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని మాసాపేటలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలలో నీటి నిలువతోపాటు చెత్తచెదారాలు పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంచిన డ్రమ్ములు, నీటి సంపులలో దోమల లార్వాలు పెరిగిపోకుండా నీటిని శుద్ధి చేయాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే సేవించాలన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు ఉంటే వైద్యసిబ్బందిని సంప్రదించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల వ్యాప్తి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలంటూ కోరారు. అనంతరం కమిషనర్ మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బందితో కళాశాల పాఠశాల పరిసరాలు, నీటిసంపు తదితరాలను పరిశీలించి శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లత, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరామయ్య, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, ఏఎన్ఎం సలీమా, ఆశ వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

తాగునీటి వృథాను అరికట్టండి

పట్టణంలోని జరుగుతున్న తాగునీటి వృథాను వెంటనే అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, మంత్రి సోదరుడు రాహుల్‌రెడ్డిలు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలో 9వ వార్డు పరిధిలోని పలు వీధులలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పైపులైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలంటూ సూచించారు.

పల్లకీలో ఊరేగిన వీరభద్రుడు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూల విరాట్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి


మట్టిని అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

సుండుపల్లె : మండల కేంద్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతులు లేకుండా అక్రమ లేఔట్లకు మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల సమీపంలోని గుట్టకాడ బలిజపల్లెలో నుంచి ప్రభుత్వ భూమిలో గుట్టను జేసీబీ యంత్రాలతో తవ్వి వందలకొద్ది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళనా కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు.

భవిత కేంద్రం తనిఖీ

సిద్దవటం: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని ఎంఈఓ విలియంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల హాజరు రిజిస్టర్, ఉపాధ్యాయుల రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమణ నుంచి కాపాడండి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని గున్నికుంట్ల మార్గంలో సర్వేనంబరు 81లో 6.82 సెంట్ల శ్మశానం భూమి ఆక్రమణ గురైందని, కబ్జాదారుల ఆక్రమణ నుంచి భూమిని వెంటనే కాపాడాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేశారు. బీసీ సంఘం నేత ఇడగొట్టు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గున్నికుంట్ల రోడ్డు, రాయల్‌బేకరి వీధి, ఎస్ఎన్ కాలనీ, కృష్ణాపురం, కొత్తపేట తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు శ్మశాన స్థలాన్ని ఆక్రమణ నుంచి కాపాడాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సర్వే నంబరు 81లోని 6.82 సెంట్ల భూమిని పట్టణ ప్రజలు గత 50 ఏళ్లుగా శ్మశానం కోసం వినియోగించుకుంటున్నారన్నారు. కొందరు వ్యక్తులు శ్మశానస్థలంలో పెద్దపెద్ద గుంతలు తవ్వి మురుగునీటి నింపి అక్కడ శవాలను పూడ్చకుండా పరోక్షంగా అడ్డుకోవడం జరిగిందన్నారు. అనంతరం సదరు భూమిని ఆక్రమించుకుని ప్లాట్లు వేసి విక్రయించుకున్నారంటూ ఆరోపించారు. శ్మశానం స్థలం కబ్జాకు గురవడంతో పట్టణ వాసులు చనిపోయిన వారిని ఎక్కడ పూడ్చుకోవాలో తెలియక తల్లడిల్లుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి శ్మశానం స్థలంను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకుని తిరిగి శ్మశానంగా ఉపయోగించుకునేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు డీఆర్ఓ సత్యనారాయణకు వినతిపత్రంను అందచేశారు.


నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు

రోడ్డుకు మరమ్మతులు చేయించండి

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి రోడ్డు మరమ్మతులకు కంకరను వేసి వదిలేశారని, ఆ రోడ్డుపై వెళ్లాలంటే నరకం కనబడుతోందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పని కావడంతో బిల్లులు అవుతాయో, కావోనని, గుత్తేదారులు పని మధ్యలో వదిలేశారని తెలిపారు. గ్రామం నుండి మండల కేంద్రానికి, అగ్రహారం మూవిరెడ్డిగారిపల్లె, గాలంగుండ్లపల్లె, మాలపల్లి, గాండ్లపల్లె గ్రామాల ప్రజలు పాఠశాలలకు, ఉపాధ్యాయులు, వృద్ధులు, ద్విచక్రవాహనాలకు, ఆటోలు ఈ మార్గంలో వెళ్లాలంటే నరకయాతను అనుభవిస్తున్నారని తెలియజేస్తున్నారు. కొత్త ప్రభుత్వం మా గ్రామస్తుల బాధను అర్థం చేసుకొని త్వరితగతిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

రెవెన్యూ కార్యాలయాలకు భద్రత కల్పించాలి

రాజంపేట : రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ కార్యాలయాలకు ప్రభుత్వం పటిష్టమైన భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తన కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ భూములు భారీస్థాయిలో ఆక్రమణలకు గురయ్యాయన్నారు. మదనపల్లెలోని సబ్ కలెక్టర్ కార్యాలయ భవనాలు నూతనంగా నిర్మించారన్నారు. ఆ భవనాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే ఆస్కారం ఉండదన్నారు. అందువలన సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయ విచారణ చేయించాలన్నారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాలకు పోలీసుల భద్రత కల్పించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను కోరారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

రాజంపేట టౌన్ : దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల రాజంపేట శాఖ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐఏఎస్ స్మితా సబర్వాల్ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర మనోవేదనకు గురిచేశాయన్నారు. ప్రతిభకు వికలత్వం అడ్డుకాదన్నారు. దివ్యాంగులు ఐఏఎస్ అధికారులై ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నవారు ఉన్నారన్న విషయాన్ని ఆమె మరచిపోవడం బాధాకరమన్నారు. యూపీఎస్సీ, ఏపీఎస్ఎస్సీలో అనేక మంది నకిలీ వికలత్వం సర్టిఫికెట్లు పొంది ఉద్యోగాలు పొందివున్నారని ఆయన ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకొని నిజమైన దివ్యాంగులకు న్యాయం చేయాల్సిందిపోయి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. శారీరక దివ్యాంగులకు రోస్టర్ పాయింట్ 53 వల్ల ఉద్యోగాలు పొందలేకపోతున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులను కించపరిచిన స్మితా సబర్వాల్‌పై సెక్షన్ 92 ప్రకారం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంఘం ప్రతినిధులు సుబ్బారెడ్డి, నరసింహులు, ఖాదర్‌బాషా, ప్రసాద్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

చిట్వేలి : మండల పరిధిలోని వెంకట్రాజుపల్లి ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక దాతలు రూ. 1,10,000లు సోమవారం బహుమతులుగా అందించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మనోహర్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రథమ బహుమతి వై.హర్షవర్ధన్‌కు రూ. 60 వేలు, ద్వితీయ బహుమతిగా పి.రాజశ్రీ రూ. 30 వేలు, అలాగే మూడో బహుమతిగా నితూష రూ. 20 వేలు నగదు, ప్రోత్సాహక సర్టిఫికెట్‌లను అందజేశారు. విదేశాలలో ఉన్న దాతలు తిరుక్కలం వంశీ, హేమంత్, అంతటి శివ, మలిశెట్టి నరసింహ కుమార్, ప్రశాంత్, నకుల్‌లు నగదును సమకూర్చారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ రాబోవు సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అధిక మొత్తంలో బహుమతులు అందించడానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసిన దాతలు

కుష్టువ్యాధి సర్వేకు సహకరించండి

రామాపురం : చర్మంపై స్పర్శలేని మచ్చలు కుష్టువ్యాధి లక్షణాలు కావచ్చునని, వెంటనే గ్రామాల్లోకి వస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు చూపించాలని ఎంఎల్‌హెచ్‌పీ తులసమ్మ పేర్కొన్నారు. మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీ దళితవాడలో సోమవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా సర్వే నిర్వహించి పలువురిని పరీక్షించారు. మాట్లాడుతూ గ్రామాలలో ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కుష్టు లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధికి మందులు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు.

‘శిక్షా సప్తాహ్’తో విద్యాభివృద్ధి సాకారం

సంబేపల్లె : నూతన జాతీయ విద్యా విధానం అములులోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా విద్యాభివృద్ధి సాకారానికి ‘శిక్షాసప్తాహ్’ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు సంబేపల్లె జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి సోమవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్రశిక్ష స్టేట్ పీడీ శ్రీనివాసరావు, డీఈఓ శివప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు నేటి నుంచి ఈ నెల 28 వరకు అన్ని పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించి నమూనాలను ఉపాధ్యాయులతో కలిసి ఆయన పరిశీలించారు. అలానే మండలంలోని ఆదర్శ పాఠశాలలోనూ శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



సంబేపల్లె: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా చేసిన నమూనాలతో విద్యార్థులు

పండుగ వాతావరణంలా శిక్షా సప్తాహ్

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పాఠశాల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పాఠశాలల్లో జరిపారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి విద్యాభివృద్ధికి తోడ్పడే పలు కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఎంఈఓ చక్రీనాయక్ మండలంలోని చౌటపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి వాటి ఉద్దేశాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నూతన ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు చేసేలా ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి

పుల్లంపేట : విద్యార్థులలో దాగివున్న మేధోశక్తిని, నైపుణ్యాన్ని వెలికితీసినప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓలు నాగాతిరుమలరావు, చక్రాధర్ రాజులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని దళవాయిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన శిక్షా సప్తాహ్ ఎన్ఈపీ 2020 కార్యక్రమంలో భాగంగా ఏడురోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా వివిధ ప్రాజెక్టులు గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.